# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





## పలమనేరు గోశాలను టిటిడి చైర్మన్ ఆకస్మిక తనిఖీ



పలమనేరు,మే 21,ప్రభాతవార్త: పలమనేరు టిటిడి గోశాలను టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం పలమనేరు మండలం మొరం వద్ద సుమారు 450 ఎకరాలలో ఏర్పాటు చేసిన టిటిడి గోశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.గోశాలలో సిబ్బంది నిర్లక్ష్యం,నిర్వహణా లోపంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.గోశాలలో అపరిశుభ్రతపై సిబ్బందిని నిలదీశారు.గోవుల నిర్వహణలో లోపం కనిపిస్తే వారిపై చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం గోశాలలో ఉన్న గోవులను పరిశీలించి వాటికి అందిస్తున్న దాణా,తాగు నీరు,అందిస్తున్న వైద్యశావలపై అధికారులను ఆరాతీశారు.

## గణనాధుని దర్శించుకున్న టీటీడీ బోర్డు సభ్యులు



కాణిపాకం, మే 21 ప్రభాతవార్త: తిరుమల తిరుపతి బోర్డు సభ్యులు నన్నపనేని సాంబశివరావు బుధవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ శ్రీధర్‌బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీతిరుపతి గంగమ్మను దర్శించుకున్న సిఎం చంద్రబాబు దంపతులు

**- అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ.. వేదపండితుల ఆశీర్వచనం !!**



కుప్పం, మే 21 ప్రభాతవార్త

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారిని బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సిఎం సతీమణి నారా భువనేశ్వరి దర్శించుకున్నారు. అమ్మవారి జాతరలో భాగంగా బుధవారం అమ్మవారు విశ్వరూప దర్శనమిచ్చారు. సిఎం దంపతులు బుధవారం మధ్యాహ్నం హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. ముఖ్యమంత్రి దంపతులకు ఆలయం వద్ద ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, గంగమ్మ గుడి ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు ఘనస్వాగతం పలికారు. పూజారులు పూర్ణకుంభంతో స్వాగతించారు. అనంతరం ముఖ్యమంత్రి దంపతులు అమ్మవారికి, రాష్ట్ర ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) తరపున సారె, పట్టువస్త్రాలు సమర్పించారు. రాష్ట్రానికి మంచి జరగాలని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని సిఎం చంద్రబాబునాయుడు దంపతులు ప్రార్ధించారు. అనంతరం అమ్మవారి హుండీలో కానుకలు వేశారు. అనంతరం ఆలయం వెలుపలకు వచ్చి ప్రజలకు, భక్తులకు సిఎం చంద్రబాబునాయుడు అభివాదం చేస్తూ, పలుకరిస్తూ ముందుకు సాగారు.కార్యక్రమాల్లో సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, డా॥ సుధీర్, సత్యేంద్రశేఖర్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, వేలు,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అవినీతికి తావివ్వొద్దు.. ప్రజలకు అందుబాటులో ఉండాలి

**- ఎయిర్‌పోర్టుకై భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి.. - సిఎం చంద్రబాబునాయుడు**

కుప్పం,మే 21 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి విషయంగా ఎలాంటి అవినీతికి తావివ్వరాదని సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఒక్కరోజు కుప్పం పర్యటనకు విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం,కడ కమిటీ సభ్యులు డా॥ బిఆర్ సురేష్ బాబు, రాజ్‌కుమార్‌లతో పాటు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పిడి వికాస్ మర్మత్ తదితరులతో కొంతసేపు బస్సులో చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో బలంగా తీసుకెళ్లాలని నేతలను ఆదేశించినట్లు సమాచారం. పార్టీ నేతలు రోజూ కుప్పం తెదేపా కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సాధకబాధలు అడిగి తెలుసుకోవాలని సూచించినట్లు తెలిసింది. కుప్పం నియోజకవర్గంలో పాడి రైతులకు కోరినన్ని గోకులం షెడ్లు మంజూరు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కుప్పంలో నిర్మించతలబెట్టిన ఎయిర్‌పోర్టు నిర్మాణంకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు సమాచారం. భూములు ఇచ్చే రైతులకు ప్రభుత్వం తరపున మంచి పరిహారం అందుతుందని ఈ విషయంగా జిల్లా కలెక్టర్ రైతులతో చర్చించి భూసేకరణ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించినట్లు తెలిసింది. వీటితోపాటు పలు అంశాలపై ముఖ్యమంత్రి చర్చించి తగు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు సమాచారం.



# నేడు సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ ప్రారంభం

**- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్రమోడీ**





సూళ్లూరుపేట, మే 21 ప్రభాతవార్త

అమృత భారత్ స్టేషన్ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కావడంతో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఆయన రైల్వేస్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. సుమారు రూ.13 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకున్న ఈ రైల్వేస్టేషన్‌లో అన్ని హంగులు ఏర్పాటు చేశారు.ఈ స్టేషన్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌రావు హాజరుకానున్నారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, ఎంపీ మద్దెల గురుమూర్తి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. అన్ని హంగులతో పాటు వారికి లబ్ధి చేకూర్చే విధంగా తీర్చిదిద్దినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికుల నుంచి ప్రతిరోజు సుమారు రూ.3 లక్షలకు పైగా ఆదాయం వస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు హడావుడిగా చేస్తున్నారు.











# కుంకీ ఏనుగుల రాకతో పర్యాటక ప్రాంతంగా మారనున్న పలమనేరు

**-కర్నాటక నుండి కుంకీ ఏనుగులు పలమనేరుకు రాక -రూ.30లక్షలతో కుంకీ ఏనుగుల శిబిరం ఏర్పాటు**

పలమనేరు,మే 21,ప్రభాతవార్త:

కుంకీ ఏనుగుల రాకతో పలమనేరు ప్రాంతం పర్యటక ప్రాంతంగా మారనుంది.నియోజకవర్గంలో ఏనుగుల దాడులను నియంత్రించడానికై మరియు పలమనేరును పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికై ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్‌ల దృష్టికి తీసుకువెళ్లగా వారు సానుకూలంగా స్పందించి పలమనేరుకు కర్ణాటక రాష్ట్రం నుండి 4 కుంకీ ఏనుగులు అందించేలా చర్యలు తీసుకున్నారు.ఈ మేరకు బుధవారం రాత్రి 4 కుంకీ ఏనుగులు పలమనేరుకు చేరుకున్నాయి.కర్నాటక రాష్ట్రం బెంగళూరు విదానసౌదా నందు బుధవారం కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య,ఏపి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్ ఆధ్వర్యంలో 6 కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి ఇవ్వడం జరిగింది.అందులో 4 ఏనుగులను పలమనేరు మండలంలోని ముసలమడుగు వద్ద నూతనంగా నిర్మించిన కుంకీ ఏనుగుల శిబిరానికి చేరుకున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగా పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నియోజకవర్గంలో ప్రధాన సమస్య అటవీ ప్రాంత రైతులకు ఏనుగుల నుండి ఎదురౌతున్న సమస్యలపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో ప్రస్తావిస్తూ పలమనేరు మండలంలో ఏనుగుల నియంత్రణకు కుంకీ ఏనుగుల అవసరం ఉందని,కుంకీ ఏనుగుల నిర్వహణకు ముసలమడుగు వద్ద 50 ఎకరాల అనువైన స్థలం ఉందని,కుంకీ ఏనుగుల ఏర్పాటుతో పాటు ఆ ప్రాంతం పర్యటక ప్రాంతంగా సైతం అభివృద్ధి చేపట్టవచ్చని తెలపడంతో ఉపముఖ్యమంత్రి మరియు అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాన్ తక్షణం నిధులను ఆమోదించడంతో పాటు కర్నాటక రాష్ట్రం నుండి శిక్షణ పొందిన కుంకీ ఏనుగులను పలమనేరు తీసుకువస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ క్రమంలో గత 3 నెలలుగా ముసలమడుగు వద్ద 50 ఏకరాలలో కుంకీ ఏనుగుల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లను పలమనేరు ఎఫ్ఆర్ఓ నారాయణ చేపట్టారు.ఎప్పటికప్పుడు స్థానిక ఎమ్మెల్యే సూచనలు సలహాలతో అభివృద్ధి పనులను ఆయన చేపట్టారు.ఈ క్రమంలో రాష్ట్రంలోనే మొట్టమొదట పలమనేరులో కుంకీ ఏనుగుల నిర్వహణ శిబిరం మరియు పర్యటక ప్రాంతంగా అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టారు.



## రేణిగుంటకు రానున్న కుంకి ఏనుగులు



రేణిగుంట మే 21 ప్రభాతవార్త

కొంతకాలంగా తిరుపతి జిల్లా రేణిగుంట మండలం మామండూరు చైతన్య పురం ప్రాంతానికి చెందిన రైతుల పంట పొలాలను, మామిడి అరటి తదితర తోటలను ధ్వంసం చేసిన ఏనుగులను అదుపు చేయడానికి కుంకీ ( తర్ఫీదు పొందిన) ఏనుగులు రానున్నాయి. ఆరు కుంకీ ఏనుగులను రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వాన్ని అడుగగా అందుకు అంగీకరించిన కర్ణాటక ప్రభుత్వం నాలుగు ఏనుగులను పంపుతోంది. రెండు ఏనుగులు ఆరోగ్యపరమైన సమస్యలు ఉండటంతో పంపలేదు. త్వరలో వాటిని కూడా పంపనున్నారు. కర్ణాటక రాష్ట్రంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కర్ణాటక ప్రభుత్వ ప్రతినిధులు జండా ఊపి ఏనుగులను ఆంధ్రప్రదేశ్ కు పంపారు. ఈ కుంకీ ఏనుగులను కర్ణాటక అటవీ శాఖ అధికారులు ఆంధ్ర ప్రదేశ్ అటవీ శాఖ అధికారులకు అధికారికంగా అప్పగించారు. ఏనుగులు పంపడానికి కృషిచేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు శ్రీ కాళహస్తి నియోజకవర్గం జనసేన ఇన్చార్జి కోట వినుత, జనసేన నేతలు కోట చంద్రబాబు, నగరం భాస్కర్ బాబులు ధన్యవాదాలు తెలిపారు.







## డిజిల్ సరఫరా బంద్ ఆగిన ట్రాక్టర్లు

శ్రీకాళహస్తి,మే 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపాలిటికి పెట్రోల్ బంకు యజమానుల డిజిల్ సరఫరాను ఆపివేసారు. దాంతో పారిశుద్ధ్యాన్ని నిర్వహించే ట్రాక్టర్లు ఆగాయి. బిల్లుల చెల్లింపుల్లో మున్సిపాలిటి నిర్లక్ష్యం పారిశుద్ధ్యానికి శాపంగా మారింది. గత కొన్ని నెలలుగా మున్సిపాలిటి డిజిల్ తీసుకుంటూ చెల్లింపుల విషయంలో నిర్లక్ష్య చేసారు.దాంతో ట్రాక్టర్లు ఆగాయి. అందిన సమాచారం మేరకు ఎంజిఎం పెట్రోల్ బంకుకు సుమారు రూ.50లక్షలు, కొత్తపేటలోని వవెంకటముని పెట్రోల్‌బంకుకు సుమారు రూ.40లక్షలు బకాయిలున్నట్లు సమాచారం. గతంలో ఎన్నడూ ఇంత ఎపెద్ద మొత్తాల్లో బకాయిలు పెట్టలేదని తెలిసింది.బిల్లుల చెల్లింపులకు సంబంధించి స్థానిక అధికారులు సిఎంఎఫ్‌కు పంపినట్లు సమాచారం అయితే అక్కడ చెల్లింపులు చేయక బిల్లులు వాపసు వచ్చినట్లు సమాచారం. పెట్రోల్ బంకుల వారు మున్సిపల్ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొట్టి అభ్యర్థించి చివరకు సాధ్యం కాదని డిజిల్ సరఫరా అపివేసినట్లు సమాచారం. అయితే రెండు రోజులుగా శానిటరీ ఇన్సెపెక్టర్ రోజూ రూ.వేయ్యి చెల్లించి డిజిల్ కొనుగోలు చేసి ట్రాక్టర్లను నడిపినట్లు సమాచారం.ఏటా మున్సిపాలిటికి పన్నుల ద్వారా రూ.9కోట్లు డిమాండ్ కాగా డిజిల్ సరఫరాకు కూడా కాసులు చెల్లించలేదంటే పరిపాలన పట్ల అధికారుల తీరును అద్దం పడుతుంది.

# రహదారుల ప్రమాదాలను నివారించండి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజులు పిలుపు**



తిరుపతి కలెక్టరేట్, మే 21 ప్రభాతవార్త ః

రహదారుల ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జరిగిన జాతీయ రహదారులపై నిత్యం జరిగే ప్రమాదాలపై జిల్లా రహదారి భద్రత కమిటి సభ్యులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు సంయుక్తంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాయుడు పేట పూతల పట్టు జాతీయ రహదారిపై ఇప్పటి వరకు జరిగిన రహదారి ప్రమాదాలపై ఆడిట్ నిర్వహించాలని జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. జిల్లాలో పోలీస్, రవాణాశాఖ వారు సంయుక్తంగా నిర్వహించి గుర్తించిన వంద ప్రమాద బ్లాక్ స్పాట్స్ పై నివేదికను జాతీయ రహదారి అధికారులను కోరారు.తిరుమల ఘాట్ రోడ్డుపై ఫిట్‌నెస్ లేని వాహనాలను ఎటువంటి పరిస్థితుల్లో అనుమతించరాదని రవాణాశాఖ, పోలీస్ శాఖ వారిని ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగినపుడు టోల్ ఫ్రీ నెంబరు 1033 విధిగా అందరు ప్రయాణికులు వినియోగించేలా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గించాలని, ప్రధానంగా ద్విచక్రవాహనాలు జాతీయ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు అవగాహన లేకుండా డ్రైవింగ్ చేయడం వలన ప్రాణాలు కోల్పోటం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో, పాఠశాలల, కళాశాలల బస్సులు, ద్విచక్రవాహనాలు నడిపే డ్రైవర్లకు డ్రైవింగ్ చేసేటప్పుడు డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, తగు సూచనలను అందజేయాలని, రవాణాశాఖ వారిని తక్షణమే బ్రిత్ అనలేజర్, స్పీడ్ లేజర్ గన్స్ సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి మురళీ మోహన్, ఎస్.ఈ ఆర్అండ్‌బీ మధుసూధన్‌రెడ్డి, నెల్లూరు, తిరుపతి, చెన్నై ఎన్‌హెచ్ఏఐ పీడీలు ఎంకే చౌదరి, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, తుడా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర, ఆర్అండ్‌బీ అధికారులు నేషనల్ హైవే సిబ్బంది, టీటీడీ విజిలెన్స్ అధికారులు వే ఫౌండేషన్ సిబ్బంది, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడిని నివారించాలి

- పారిశుధ్యంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలి..
- అంటువ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి..
- అధికారులు మండల అభివృద్ధికి కృషి చేయాలి..

రొంపిచెర్ల, మే 21, ప్రభాతవార్త:



గ్రామాల్లో ప్రజలకు ఎక్కడ తాగునీటి సమస్యలు రాకుండా చూసుకోవాలి ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. ఆయన బుధవారం ఎంపీడీవో కార్యాల యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా త్రాగునీటి సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకుని వస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. మండలంలో జలజీవన్ మిషన్ పనులను అధికారులు పూర్తి చేయాలన్నారు. ఎన్నికల అనంతరం గ్రామాల్లో నిలిచిపోయిన త్రాగునీటి ట్యాంకుల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ పనులను పూర్తి చేస్తే ఎక్కడ త్రాగునీటి సమస్య ఉండదన్నారు. అర్హులైన వారికి పశు సంవర్ధక శాఖ ద్వారా సంక్షేమ పథకాలు అందేయాలని అన్నారు. ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగునీటి పైపులకు అక్రమంగా మోటర్లు బిగించి నీటిని వాడుతున్నారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యం పై ప్రత్యక చొరవ తీసుకోవాలని కోరారు. గానుగచింత గ్రామపంచాయతీలో సర్పంచ్‌కు తెలియకుండానే తాగునీటి బోర్లకు విద్యుత్ మోటర్లు కొనుగోలు చేసి కొందరు బిల్లుల కోసం వస్తున్నారని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి ఆరోపించారు. పదో తరగతి ఫలితాల్లో కూడా బాలుర ఉన్నత పాఠశాల వెనుకబడి ఉందన్నారు. మహిళా రైతులను సంఘాలుగా చేసి రుణాలు మంజూరు చేస్తామని ఏపీఎం హరినాథ్ తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 35 సంఘాలకు ఏర్పాటు చేశామని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, పివైస్ ఎంపీపీ విజయశేఖర్, ఎంపీటీసీ రమణమ్మ, సిరాజున్నిసా, సర్పంచ్ లు సుధారాణి, అన్సర్ బాషా, డీటీ లోకేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి సుధారాణి, మండల ఆరోగ్య విద్యాధికారిని రాజేశ్వరి, ట్రాన్స్కో ఏఈ రాంప్రసాద్ రెడ్డి, పీఆర్ ఇంచార్జ్ ఏఈ ఫయాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ వేణుగోపాల్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## గ్రామదేవతలే గ్రామాలకు శ్రీరామరక్ష

పుంగనూరు, మే 21, ప్రభాతవార్త

సంస్కృతి సాంప్రదాయాలకు పుట్టినిల్లు అయిన భారత దేశంలో గ్రామ దేవతల ప్రాధాన్యత ఎంతో ప్రాముఖ్యం చెందిందని జనసేన నాయకుడు వేణు గోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఆయన మండలంలోని పూజ గాని పల్లిలో శ్రీ మారమ్మ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మూడు కోట్ల దేవతలతో అలరారే భారతదేశంలో ప్రతి గ్రామంలో కూడా ఆయా గ్రామాల రక్షణకు వెలసిన గ్రామ దేవతలే తొలి ప్రాధాన్యత సంతరించుకున్నారని అన్నారు. పుంగనూరులో శ్రీసుగుటూరు గంగమ్మ దేవత శ్రీ మారెమ్మ దేవతలు గ్రామదేవతలుగా కొలువై ప్రజలను రక్షిస్తున్నారని అదేవిధంగా చౌడేపల్లిలో శ్రీ బోయకొండ గంగమ్మ దేవత, పుంగనూరు సరిహద్దులోని చదల గ్రామంలో శ్రీ సప్తమాతృక సమేత శ్రీ చౌడేశ్వరిదేవి కొలువై ప్రజలను గ్రామాలను సంరక్షిస్తున్నారని అన్నారు. వేణుగోపాల్ రెడ్డి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు పూజగానిపల్లె గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రజలు వేలాదిగా పాల్గొన్నారు.

## వడమాలపేటలో వైభవంగా గంగజాతర

వడమాలపేట, మే 21 ప్రభాతవార్త:



వడమాలపేట గంగజాతర బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి గంగమ్మ ప్రతిమను గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం ఉదయం స్థానిక బస్టాండ్ వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గుడిలో భక్తుల సందర్శనార్థం గంగమ్మను కొలువుదీర్చారు. స్థానికులు కాక పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తరలివచ్చి గంగమ్మను దర్శించుకున్నారు. బుధవారం రాత్రి కుంభం వేసి దున్నపోతును బలి ఇచ్చి గ్రామంలో పొలి తిరిగారు. అనంతరం గంగమ్మ ప్రతిమను గంగలో కలిపారు. దీంతో గంగమ్మ జాతర ముగిసింది. మండలంలోని టీసీ అగ్రహారం, బలినాయుడు కండ్రిగ గ్రామాల్లోను బుధవారం గంగమ్మజాతరను ఘనంగావడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి తన సిబ్బందితో కలసి శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

## వాడవాడలా గంగజాతర వేడుకలు



**పుత్తూరు రూరల్, మే 21 ప్రభాతవార్త:** పుత్తూరు మున్సిపల్, మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ దేవత గంగజాతర వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గ్రామాల్లో నిర్వహించిన గంగజాతర వేడుకల్లో పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని గ్రామ నిర్వాహకులు పూలమాలలు వేసి శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని కొత్త తిమ్మాపురం, పిళ్లారిపట్టు, తిమ్మాపురం, తొరూరు, నేసనూరు గ్రామాల్లో గంగజాతర వేడుకలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

## సిఎం చంద్రబాబుకు ఘనస్వాగతం.. సాదర వీడ్కోలు





గుడుపల్లె, మే 21 ప్రభాతవార్త

ఒక్కరోజు పర్యటన నిమిత్తం కుప్పం విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు దంపతులకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఘనస్వాగతం,సాదర వీడ్కోలు పలికారు. బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో సిఎం చంద్రబాబు దంపతులు ద్రవిడ వర్సిటీలోని హెలిప్యాడ్‌కు మధ్యాహ్నం1.15 గంటలకు చేరుకున్నారు. అక్కడ ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, అనంతపురం రేంజ్ డిఐజి షిమోషీ, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, జిల్లా టిడిపి అధ్యక్షుడు సిఆర్ రాజన్,డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, నేతలు కోదండయాదవ్, కొడవలి శివప్రసాద్ తదితరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మధ్యాహ్నం 3.15గంటల ప్రాంతంలో సిఎం దంపతులు హెలికాప్టర్‌లో బెంగళూరు ఎయిర్‌పోర్టుకు తిరుగు ప్రయాణమయ్యారు.

## తొరూరు గంగజాతరలో మాజీ మంత్రి రోజా

పుత్తూరు రూరల్, మే 21 ప్రభాతవార్త:

పుత్తూరు రూరల్ మండలం తొరూరు గ్రామంలో గంగమ్మజాతర మహోత్సవంలో బుధవారం గంగమ్మతల్లి విశేష పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి రోజా పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. మండల వైసీపీ కుటుంబ సభ్యులు స్థానిక గ్రామస్తులు ఘన స్వాగతం పలికి ఆహ్వానించి దర్శనం అనంతరం ప్రసాదాలతో ఆలయం సభ్యులు సత్కరించారు. అలాగే పుత్తూరు మున్సిపాలిటీ 5వ వార్డు చౌటూరులో గంగమ్మ జాతర వేడుకల్లో పాల్గొని గంగమ్మతల్లికి విశేష పూజా కార్యక్రమం నిర్వహించారు.

## బంగారుపాళ్యంలో గంగజాతర



**బంగారుపాళ్యం, మే 21 ప్రభాతవార్త:** మండల కేంద్రం బంగారుపాళ్యంలో బుధవారం వైభవంగా గంగజాతర ఉత్సవాలు నిర్వహించారు. మంగళవారం రాత్రి వర్షం కారణంగా గంగమ్మ శిరస్సును గ్రామ పురవీధుల్లో నామమాత్రంగా సంప్రదాయ పద్దతిలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం బుధవారం వేకువజామున రాజా వీధిలో నడివీధిలో గంగమ్మను ప్రతిష్టించి విశేష పూజలు చేపట్టారు. జంతు బలులతో అమ్మవారి తొలి దర్శనం ప్రారంభం కాగా పలువురు మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇందులో మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా దంపతులు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి దంపదులు, మాజీ వైస్ ఎంపిపి హిమకర్‌రాజా దంపతులు, పలువురు గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే గ్రామ దేవత ముత్యాలమ్మకు విశేష పూజలను నిర్వహించారు. ముత్యాలమ్మను వివిధ పుష్పాలతో ఆలయ అర్చకులు మురళీగురుకుల్ అలంకరించారు. బుధవారం రాత్రి గంగమ్మను భారీ ఊరేగింపుతో డప్పు, వాయిద్యాల నడుమ తగ్గువారిపల్లి తక్కనకుంటలో జలప్రవేశం గాలించారు.

## మామిడి దిగుబడిపై అంచనాలు సిద్ధం చేయాలి

తవణంపల్లె, మే 21 ప్రభాతవార్త:



ప్రస్తుత సీజన్‌లో మామిడి దిగుబడిపై అంచనాలు సిద్ధం చేయాలని జిల్లా ఉద్యాన అధికారి మధుసూధన్‌రెడ్డి తవణంపల్లె, ఐరాల మండలాలకు చెందిన రైతు భరోసా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు.బుధవారం తవణంపల్లెలో తవణంపల్లె, ఐరాల మండలాలకు చెందిన రైతు భరోసా కేంద్రం సిబ్బందికి మామిడి దిగుబడిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ఆయా మండలాల్లో గ్రామాల వారిగా మామిడి ఎన్ని టన్నులు దిగుబడి వస్తుందనే అంచనాలను సిద్ధం చేయాలని తెలిపారు. సీజన్ ప్రారంభానికి ముందే ప్రణాళికలు సిద్ధం చేసుకోవడానికి ఈసరే ఉపయోగ పడుతుందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ్, ఉద్యాన శాఖాధికారి సాగరిక, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## అర్ధగిరిలో ఘనంగా శ్రీహనుమజ్జయంతి వేడుకలు ప్రారంభం



**తవణంపల్లె, మే 21 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామివారి దేవస్థానంలో శ్రీహనుమజ్జయంతి వేడుకలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ప్రతిఏటా ఆలయంలో శ్రీహనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయంలో గురువారం జరిగే హనుమజ్జయంతి వేడుకలు ఈఓ టి.హనుమంతరావు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈమేరకు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఆలయంలోని మండపంలో అర్చకులచే సాయంత్రం 6 గంటలకు అనుజ్ఞ, విశ్వక్సేనారాధన, రుత్విక్‌వరణం, వాసుదేవ పుణ్యావాచనం, రక్షాబంధనము అంకురార్పణ,కలశస్థాపన, నివేదన మంగళహారతి తదితర పూజాధి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## దళితులకు మూత్రం త్రాగించటం హేయమైన చర్య

నేషనల్ దళిత ఫోరం అధ్యక్షులు ఆనగల్లు మునిరత్నం హెచ్చరిక

పూతలపట్టు, మే 21, ప్రభాతవార్త



ఆదిమ సమాజంలో ఉన్నామా? ఆధునిక సమాజంలో ఉన్నామా? దళితులను కొట్టి మూత్రం త్రాగిస్తారా? ఇలాంటి సంఘటనలను చూస్తూ ఊరుకోమంటరా? అంటూ నేషనల్ దళిత ఫోరమ్ అధ్యక్షులు ఆనగల్లు మునిరత్నం మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. తిరుపతిలో ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్ ను అపహరించి, తీవ్రంగా గాయపరిచి, నోట్లో మూత్రం పోసి తాగిస్తే, నిందితులు ఏ పార్టీకి చెందిన వారు, ఏ నాయకుడి అనుచరులు అనే చర్చలు చేయటం, ట్వీట్ చేయటం, ఫోటోలు విడుదల చేయటం ప్రభుత్వానికి సిగ్గు చేటు చర్యగా అభివర్ణించారు. ఒక్కొక్కడిని బహిరంగంగా అరెస్టు చేసి, మీడియా ముందు నిలబెట్టి, జైలుకు పంపాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ పాలనలోని మూత్ర విసర్జన సంఘటనలు మళ్ళీ పునరావృతం అయితే, అది ప్రభుత్వానికి అగౌరవమని, చాలా ప్రమాదకరం అన్నారు. నిందితులందరినీ అరెస్టు చేయాలని, జేమ్స్‌ను హోం మంత్రి స్వయంగా వెళ్లి పరామర్శించాలని కోరారు.ఇలాంటిసంఘటనలనుదళిత సమాజం చూస్తూ ఊరుకోదని ఆనగల్లు మునిరత్నం హెచ్చరించారు.

## అన్నా క్యాంటీన్ స్థలం పరిశీలిస్తున్న తాసిల్దారు రమేష్ బాబు

పూతలపట్టు, మే 21, ప్రభాతవార్త



పూతలపట్టు నియోజకవర్గం కేంద్ర బిందువుగా ఉండి పూతలపట్టు మండలం పూతలపట్టులో బుధవారం అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి పేద బడుగు బలహీన వర్గ ప్రజలకు పెట్టడం అన్నం పెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పం కోసం తాసిల్దారు స్థల సేకరణ కోసం పరిశీలిస్తున్నారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు

కుప్పంరూరల్, మే 21 ప్రభాతవార్త

మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని కుప్పం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో



నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్ చిత్రపటానికి నేతలు, కార్యకర్తలు పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆవుల గోపి, మున్సిపల్ ఇన్‌చార్జ్ నిజామ్, మండల ఇన్‌చార్జ్‌లు మునస్వామి, కృష్ణప్ప, సుబ్రమణ్యం, నంజప్ప, మైనార్టీ, ఎస్సీ సెల్, ఒబిసి సెల్, యూత్ కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సేవాభావంతో దేశప్రగతికి సహకరించాలి

**చిత్తూరురూరల్, మే 21 ప్రభాతవార్త:** విద్యార్థులు సేవాభావాన్ని అలవరచుకొని దేశ ప్రగతికి సహకరించాలని, నిస్వార్థసేవ చేయాలని ఎన్‌సిసి క్యాడెట్లకు తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతేంద్ర దహియా సూచించారు. బుధవారం 35 ఆంధ్రా బెటాలియన్ నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంను ఆయన సందర్శించారు. ఢిల్లీలో జరుగు తలసేనా క్యాంపుకు మంచి ఫైరింగ్, ఆప్టికల్స్ శిక్షణలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందనీ, విద్యార్థులు ఏ,బి,సి సర్టిఫికేట్స్‌ను పొందాలని కోరారు. అలాగే డా. మీనాక్షి ఎన్‌సిసి విద్యార్థులకు అవసరమైన లైఫ్‌స్కిల్స్‌లో భాగంగా సిపిఆర్, వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్‌వి మోనిష్, ఏఓ లోకనాధన్, మనోజ్ కత్రి, మహేష్‌రాయ్, ఎన్‌సిసి ఆఫీసర్లు ప్రసాద్‌రెడ్డి, కార్తిక్, శ్రీలత, యుగంధర్, చిరంజీవి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు : గువ్వల

చౌడేపల్లి, మే 21 ప్రభాతవార్త



కష్టపడి పనిచేసేవారికి పార్టీలో మంచి గుర్తింపు వుంటుందని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి)అన్నారు. బుధవారం మండలంలోని ఆమినిగుంట, గడ్డంవారిపల్లి, పరికిదొన గ్రామ కమిటీల నియామకాలు, సభ్యత్వ గుర్తింపు కార్డులందించారు. ఆమినిగుంటకు శంకర, పరికిదొనకు చెంగల్రాయుడు, గడ్డంవారిపల్లికి మునివెంకటప్పలను గ్రామకమిటీల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అనంతరం తేదేపా సభ్యత్వ కార్డులను నాయకులు, కార్యకర్తలకందించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను గురించి గ్రామస్థాయిలో అవగాహన తెచ్చి తేదేపాకు, ప్రభుత్వానికి పేరు తేవాలని గువ్వల పిలుపునిచ్చారు. నాయకులు ఆవుల రామచంద్రయ్య, పూల చంద్రమౌళి, సంపాల శ్రీనివాసులునాయుడు, శ్రీధర్‌రాజు(గిరి), బోయకొండ సుబ్బు, హమీద్‌ఖాన్, ఎస్ఎండి ఘనీ, భూషణ, ఆయా పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శెట్టిపేటలో పిడుగుపాటు తృటిలో తప్పిన ప్రమాదం

చౌడేపల్లి, మే 21 ప్రభాతవార్త



మండలంలోని పంచాయతీ కేంద్రం శెట్టిపేట వద్ద పిడుగుపడి కొబ్బరి చెట్టు ధ్వంసమై తృటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈక్రమంలో శెట్టిపేటకు సమీపంలో బ్యాంకు రెడ్డెప్ప కుటుంబ సభ్యులు బోరుబావి వద్ద వర్షంలో వున్నారు. ఉన్నట్టుండి పక్కనే వున్న కొబ్బరి చెట్టుపై పిడుగుపడి మంటలు చెలరేగాయి. కూత వేటు దూరంలో నివాసమున్న ఇల్లు వుంది. పిడుగుపాటుకు కొబ్బరిచెట్టు మాత్రమే ప్రమాదం జరిగింది. కొంతమేర పక్కకు పడివుంటే ప్రాణనష్టం జరిగుండేదని స్థానికులన్నారు. దీంతో చుట్టుపక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు.

## సిఎం చంద్రబాబును కలిసిన డిసిసిబి ఛైర్మన్ అమాస

చిత్తూరురూరల్, మే 21 ప్రభాతవార్త:



కుప్పం గంగజాతరలో గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించడానికి బుధవారం కుప్పం విచ్చేసిన సిఎం నారా చంద్రబాబునాయుడును జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్‌గా నియమితులైన అమాస రాజశేఖర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం నారా చంద్రబాబునాయుడు డిసిసిబి ఛైర్మన్‌గా నియమితులైన అమాస రాజశేఖర్‌రెడ్డితో మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకును మరింత ప్రగతి పథంలోకి తీసుకెళ్ళడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆర్థిక ప్రణాళికలు రూపకల్పనకే మహానాడు

- ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్

శ్రీరంగరాజపురం, మే 21 ప్రభాతవార్త:



నియోజకవర్గ పరిధిలోని సమస్యలను గుర్తించి నియోజకవర్గ స్థాయి మినీ మహానాడులో ఈ సమస్యలను ప్రస్తావించి ఈ సమస్యలను జిల్లా మహానాడు దృష్టికి తీసుకెళ్ళి ఆపై రాష్ట్ర స్థాయి మహానాడులో సమస్యలు వుంచడానికే మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు జీడినెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ అన్నారు. శ్రీరంగరాజపురంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో బుధవారం జీడినెల్లూరు నియోజకవర్గ మినీ మహానాడు జరిగింది. ఈ మినీ మహానాడు కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరై ప్రభుత్వ విప్, జీడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్‌ను గజమాలతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ మినీ మహానాడులో నియోజకవర్గానికి ఇండస్ట్రియలల్ కారిడార్, ఎస్ఆర్ పురంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు, వెదురుకుప్పంలో మినీ స్టేడియం, నియోజకవర్గ పరిధిలోని సింగిల్ రోడ్లకు రహదారుల రూపకల్పన, జీఎంఆర్ పురం వద్ద వంతెన నిర్మాణం, ఇలా నియోజకవర్గ పరిధిలోని సమస్యలను చర్చించి మినీ మహానాడులో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ మాట్లాడుతూ కార్యకర్తల పోరాట పటిమతోనే తాను ఇక్కడి నుండి ఎమ్మెల్యేగా విజయం సాధించానని, నియోజకవర్గ అభివృద్ధికి తాను చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ పురం మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్‌నాయుడు, నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు, జిల్లా నాయకులు శ్రీధర్ యాదవ్, గంధమనేని రాజశేఖర్‌నాయుడు, గుండయ్య, సూరిరెడ్డి, మురళీ, మండలాల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజలందరికీ గంగమ్మ అశీస్సులు

గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే గురజాల

గుడిపాల, మే 21 ప్రభాతవార్త:



ప్రజలందరికీ గంగమ్మ తల్లి అశీస్సులు మెండుగా లభించేలా చూడాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ప్రార్ధనలు చేశారు. మండలంలోని కట్టకిందపల్లి గ్రామంలో బుధవారం జరిగిన గంగమ్మ జాతర వేడుకలకు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడును ఘనంగా సన్మానించి గంగమ్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు. గంగమ్మ తల్లి కరుణ కటాక్షాలతో ప్రజలందరు సుఖంగా వుండేలా చూడాలని ఎమ్మెల్యే గురజాల గంగమ్మను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు, ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

---

## వైభవంగా గంగ జాతర



సోమల, మే 21, ప్రభాతవార్త

సోమలలో మంగళవారం ప్రారంభమైన గంగజాతర బుధవారం అమ్మవారిని జలాధివాసం చేయడంతో ముగిసింది. మంగళవారం రాత్రి 7 గంటలకు అమ్మవారిని పుట్టిల్లుగా భావించి కుమ్మరి కులస్తుల ఇంటి నుంచి ఊరేగింపుగా అత్తగారిగా భావించే రజకుల ఇంటికి తీసుకువెళ్లారు. అనంతరం అక్కడ సారె, చీర అందుకున్న అమ్మవారిని నడివీధి గంగమ్మ వద్ద ప్రతిష్టించారు. అనంతరం గ్రామస్తులు పొలిమేర దేవతలకు బోనాలు సమర్పించారు. బుధవారం ఉదయం నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని సందర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో అమ్మవారిని జలాధివాసానికి తీసుకువెళ్లారు.

## కళ్యాణ మండపానికి విరాళం



సోమల, మే 21, ప్రభాతవార్త

సోమల శివాలయం సమీపంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి సోమల కు చెందిన సోమల సురేష్ 100000 విరాళంగా అందించారు. దాతల విరాళాలతో నిర్మిస్తున్న కళ్యాణ్ మండపానికి తన తండ్రి సాంబయ్య పేరు మీదుగా విరాళాన్ని అందిస్తున్నట్లు సురేష్, సంగీత దంపతులు పేర్కొన్నారు. విరాళాలు ఆలయ ధర్మకర్త సోమశేఖర్ రాయల్‌కు బుధవారం ఉదయం శివాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో సీఎం మధు, ఆయన రమేష్, రఘు హరి నారాయణ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 21ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామిని విఐపి బ్రేక్‌లో టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్,మాజీమంత్రి ఆర్‌కో రోజా దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.





## పూసపాటి వెంకటరమణ, కల్లూరి వేమాద్రిలపై కఠిన చర్యలు తీసుకోవాలి



తిరుపతి హెల్త్, మే 21 ప్రభాతవార్త ః

నా దగ్గర తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వక ఎగొట్టేందుకు ప్రయత్నించి నాపై తప్పుడు పోలీసు కేసులు పెట్టిన పూసపాటి వెంకటరమణ, మీడియా ప్రతినిధి కల్లూరి హేమాద్రిలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నేత నీరుగట్టు నగేష్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వక నాపై దౌర్జన్యం చేసిన వారిద్దరిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నాకు న్యాయం చేయాలని బాధితుడు నగేష్ జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్స్ జీవితాల్లో వెలుగు

తిరుపతి రూరల్, మే 21 ప్రభాతవార్త ః



సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎండీయూ రద్దుతో రేషన్ డీలర్స్ జీవితాలలో వెలుగులు నింపారని తిరుపతి జిల్లా అధ్యక్షులు సి. వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తా కోటేశ్వరనాయుడు, తిరుపతి అర్బన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పి. హేమలత, జిల్లా ప్రధాన కార్యదర్శి జే హెచ్ సాల్మన్ రాజు, తిరుపతి రూరల్ మండలం కోశాధికారి కె.దొరస్వామియాదవ్, హరినాథ్ నాయుడు, సి. సుజాత, అర్బన్ డీలర్స్, తిరుపతి రూరల్ డీలర్స్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు దివిలీలా మాధవరావు పిలుపు మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడి కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం సీఎం నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

## పేరూరు గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

తిరుపతి రూరల్, మే 21 ప్రభాతవార్త ః



తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామ పంచాయితీలో మండల పరిషత్ 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో అభివృద్ధి పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. సర్పంచ్ దామినేటి కేశవులు, ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విదుదల మాధవరెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీడీవో కె. రామచంద్ర పాల్గొన్నారు. గ్రామంలోని రాములవారి గుడి నుంచి గణపతి వీధి ఇండ్లు వరకు మురుగునీటి కాలువ నిర్మాణానికి రూ. 1.85లక్షల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. మునస్వామి ఇంటి నుంచి షాపింగ్ కాంప్లెక్స్ వరకు కాలువపై కవర్ స్లాబ్ నిర్మాణానికి రూ. 3.40 లక్షలు మంజూరు అయ్యాయి. గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం అందించేందుకు 2000 లీటర్ల సామర్థ్యం గల ఆర్‌వో ప్లాంట్ నిర్మాణానికి రూ. 4.60లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే గ్రామస్తులకు మౌళిక సదుపాయాలు మెరుగుఅవుతాయని అధికారులు పేర్కొన్నారు.

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ - ఇద్దరికి తీవ్ర గాయాలు

**పుత్తూరు రూరల్, మే 21 ప్రభాతవార్త:**

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలైన సంఘటన పుత్తూరు మండల పరిధిలో బుధవారం జరిగింది. సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు... ఏర్పేడు మండలం పాపానాయుడు పేట సమీపంలోని రావిళ్ళవారిపల్లె గ్రామానికి చెందిన భాస్కర్(55), కృష్ణయ్య(75) ద్విచక్రవాహనంపై పుత్తూరుకు వస్తున్నారు. అదే సమయంలో పుత్తూరు మండలం శిరుగురాజుపాళెం పంచాయతీ పొట్టిగుట్టలు గ్రామానికి చెందిన వెంకట్రాది(30) అతని భార్య దీప(28), మూడేళ్ళ కూతురు, 8 నెలల కొడుకుతో స్కూటీపై పుత్తూరుకు వస్తూ స్థానిక పెట్రోల్ బంకు వద్ద రోడ్డు క్రాస్ చేస్తూ రావిళ్ళవారిపల్లె నుంచి వస్తున్న వారి వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో భాస్కర్, కృష్ణయ్యలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంకటాద్రికి స్వల్పగాయాలు కాగా తీవ్రంగా గాయపడిన వారిని 108లో తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

## పరశురామేశ్వరుని దర్శించుకున్న ఎజిఎ

శ్రీకాళహస్తిరూరల్,మే 21 ప్రభాతవార్త



గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాలయాన్ని బుధవారం ఎజిఎ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో మాజీ ఛైర్మెన్ బత్తల గిరి బాబు, ఇఒ రామచంద్రారెడ్డి, వేదపండితులు,అర్చకులు స్వాగతం పలికారు. చారిత్రక ప్రసిద్ది చెందిన ఆలయాన్ని ప్రస్తుతం పర్యాటక శాక పర్యవేక్షిస్తుంది. ఆలయంలో వెలసిన స్వామి విగ్రహం ప్రత్యేక శైలిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటీవల శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పట్టుబట్టి జిల్లా కలెక్టర్ నుంచి నిధులు సాధించి బిటి రోడ్డును నిర్మించారు. దాంతో తిరుపతి నుంచి విఐపిల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం ఎజిఎ ఎస్ జి వెంకటరామయ్య కుటుంబసభ్యులతో రాగా వారికి దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనానంతరం స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించి ఆశీర్వదించారు.

## జాతరలు మన సంప్రదాయాలను సూచిస్తుంది.ఎంఎల్‌ఏ

శ్రీకాళహస్తిరూరల్,మే 21 ప్రభాతవార్త



జాతరలు మన సంప్రదాయాలకు సూచికలని శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సూరావారి పల్లిలో గంగమ్మజాతరకు హాజరై అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపారు.ఈ సందర్బంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో గాదులు నిండిన తరువాత జాతరలు నిర్వహించటం మొదటి నుంచి వస్తున్న ఆచారం అన్నారు. గ్రామ దేవతలు నిత్యం గ్రామాన్ని రక్షిస్తుంటారన్నారు. పురాతన కాలం నాటి సంప్రదాయాలు ఎంతో మహోన్నతమైనవన్నారు.జాతరల వల్ల గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందన్నారు.ప్రతి గ్రామంలోనూ సరిహద్దుల్లో తెట్టు రాళ్ళు ఏర్పాటు చేసి ఉన్నారని వివరించారు.ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సు తలో సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని పూజించినట్లు వివరించారు.ఈ సందర్బంగా గ్రామానికి చెందిన మహిళలు ఎంఎల్‌ఏకు సమస్యను మొరబెట్టుకున్నారు.మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ చెంచయ్యనాయుడు, తెలుగుదేశం నాయకులు ప్రసాద్‌నాయుడు,రమేష్‌నాయుడు,కృష్ణమనాయుడు,మనోహర్,రాజకుమార్,గ్రామస్తులు పాల్గొన్నారు.

## డాలర్‌ను సత్కరించిన ఎంఎల్‌ఏ

శ్రీకాళహస్తి,మే 21 ప్రభాతవార్త



తిరుపతిజిల్లాలోని తుడా ఛైర్మెన్‌గా డాలర్స్ దివాకర్‌రెడ్డిని నియమించటంతో జిల్లాలోని తెలుగుదేశం కార్యకర్తల్లో సంబరాలు చోటు చేసుకున్నాయి. బుదవారం ప్రమాణ స్వీకారానికి శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున జనసమీకరణ గావించారు. ఓ వైపు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి,మరో వైపు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్‌లు జనసమీకరణ గావించారు. తిరుపతిలో జరిగిన ర్యాలిలో పాల్గొన్నారు.కాగా బాధ్యతలు స్వీకరించిన దివాకర్‌రెడ్డిని అభిమానులు సత్కరించారు.ఈ సందర్బంగా సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తీశ్వరుని చిత్రపటాలను అందించారు.ఒకే పూల మాలలో ఇద్దరిని సత్కరించారు.

## మంచికి మారుపేరు: నిజాయితికి పెట్టింది పేరు

శ్రీకాళహస్తి,మే 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి రాజకీయ చరిత్రలో మంచికి మారుపేరుగా నిజాయితికి పెట్టింది పేరుగా శాంతారాంజెపవార్ ప్రజల గుండెల్లో తిరుగులేని స్థానానికి సంపాదించారని పలువురు వక్తలు అబివర్ణించారు.బుధవారం ద స్కూల్ ఆవరణలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.7వ వర్థంతి సందర్బంగా పట్టణ ప్రముఖులు, ద స్కూల్ సిబ్బంది నివాళులర్పించారు. ఈసందర్బంగా పలువురు మాట్లాడుతూ రెండు పర్యాయాలు శ్రీకాళహస్తి మున్సిపల్ ఛైర్మెన్‌గా మూడు సార్లు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా శాంతారాం జేవార్ తిరుగులేని,నిజాయితి వంతమైన పాలనను అందించారన్నారు. రాజకీయాల్లో నిర్వివాదాంశుడుగా ఆయన రాణించారన్నారు. చేపట్టిన పదవికి వన్నెతెచ్చిన ఆయన మరణం తీరని లోటు అన్నారు. ఓ వైపు రాజకీయాల్లో రాణిస్తూ మరో వైపు నిరుపేదలకు సైతం కార్పొరేట్ విద్యను కారు చౌకగా అందించుటకు శ్రీకాళహస్తిలోమొట్టమొదటి సారి కేరళ ఉపాధ్యాయులతో ద స్కూల్‌ను స్థాపించారని వివరించారు.ఆర్చన జే పవార్, పివిఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్‌రావు వి.పవార్, డైరెక్టర్లు ముకుందరావుజే పవార్, దస్కూల్ కరస్పాండెంట్ జనార్థన్‌రావు పవార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విశాల,ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అందరి సహకారంతో తొట్టంబేడు మండలం అభివృద్ధి

-మండల పార్టీ అధ్యక్షుడు

.తొట్టంబేడు, మే 5 ప్రభాతవార్త



అందరి సహకారంతో తొట్టంబేడు మండలాన్ని అబివృద్ధి పరచే దిశగా ముందుకెళ్తానని నూతనంగా తొట్టంబేడు తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన రావిళ్ళమునిరాజనాయుడు అన్నారు. బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ తొట్టంబేడు మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడుగా అవకాశం కల్పించిన ఎంఎల్‌ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని అందరి నాయకులను కలుపుకుని ముందుకెళ్తానని మండలంలో ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే ఎంఎల్‌ఏకు తెలియజేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు కూడా ప్రజలు కార్యాలయాల చుట్టు తిరగకుండా వెంటనే వారి సమస్యలను పరిష్కరించేలా చూస్తామన్నారు. దివంగతనేత శ్రీకాళహస్తి అభివృద్ధి ప్రదాత స్వర్గీయ గోపాలకృష్ణారెడ్డితో కూడా తనకు పనిచేసిన అనుభవం ఉందన్నారు. మండలంలోని 27పంచాయతీల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కరించేలా చూస్తామని పాత్రికేయులు కూడా ఏసమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. మండలంలోని అందరి నాయకులకు కలుపుకుని నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన్ను పలువురు మండల నాయకులు దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నసింగమాల సర్పంచ్ నాగమణి, పూడి మాజీ సర్పంచ్ మునిరత్నం పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీకి నివాళులు

శ్రీకాళహస్తి, మే 21 ప్రభాతవార్త



స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో దివంగత రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ భారత 7వ ప్రధానిగా బాధ్యతలు తీసుకున్నారని తన 47వ సంవత్సరంలో శ్రీలంక ఉగ్రవాదం చేతిలో హతమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ఐటి, టెలికమ్యూనికేషన్ రంగం ఆయన హయాంలోనే అభివృద్ధి సాధించిందన్నారు. పేద,బడుగు బలహీన, దళిత వర్గాల వారిని అనేక రకాలుగా ముందుకు తీసుకెళ్ళారని, చిన్నవయస్సు లో ఆత్మాహుతిదాడిలో పరమపదించడం దారుణం అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటముని, ఇర్లగోపి, శెట్టిపల్లిశివ, నాగూరయ్య ఆర్ముగం, వెంకటేశ్వర్లు, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఆధ్వర్యంలో నివాళులు

శ్రీకాళహస్తి, మే 5 ప్రభాతవార్త



భారత దివంగత ప్రధాని భారతరత్న రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి సందర్బంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పారఌ్ట సమన్వయకర్త తలపా దామోదరంరెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్బంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ భారతదేశ అభివృద్దికి దిశ, దశను రూపొందించిన గొప్ప దార్శనికుడు అని దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయనటువంటి కుటుంబం ఆయనదని ప్రపంచీకరణకు నాంది పలికి నేడు యావత్ భారత దేశ ప్రగతికి పునాదులు వేసిన గొప్పనాయకుడని ప్రశంసించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, యువత అధ్యక్షుల నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్యాణ్, రాజేంద్ర, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

## హిమాయత్‌నగర్ వెంకన్న బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



తెలంగాణా హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్స వాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జూన్ 2వతేదీ నుండి 7వతేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్స వాలకు బుధవారం రాత్రి తిరుమలలో టిటిడి ఛైర్మెన్ బిఆర్‌నాయుడు గోడపత్రికలు విడుదల చేశారు.

ప్రభాతవార్త-తిరుమల

## గంగమ్మకు చెవిరెడ్డి లక్ష్మి సారె

రామచంద్రాపురం,మే 21 ప్రభాతవార్త:

మండలంలో నెన్నూరు, రాయలచెరువు పేట గ్రామాలలో జరుగుతున్న గంగ జాతరను పురస్కరించుకుని మాజీ ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి బుధవారం సారె సమర్పించారు. తుమ్మలగుంట కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నుండి ఇక్కడికి సారెను తీసుకువచ్చారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు గ్రామ పెద్దలు, మహిళలు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రదర్శన గావించి గంగమ్మకు ఆలయ పూజారికి సారెను అందజేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు మురగయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంగమ్మకు పులివర్తి సుధారెడ్డి సారె

రామచంద్రాపురం, మే 21 ప్రభాతవార్త:



మండలంలో నెన్నూరు, రాయలచెరువు పేట గ్రామాలలో జరుగుతున్న గంగ జాతరను పురస్కరించుకుని ఎంఎల్‌ఏ పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి బుధవారం సారె సమర్పించారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు గ్రామ పెద్దలు, మహిళలు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రదర్శన గావించి, ఆలయ పూజారికి సారెను అందజేసి, గంగమ్మకు ప్రత్యేక పూజలు జరిపించారు. గ్రామ పెద్దలు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మేకల తిరుమల రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏ పులివర్తి నానికి రేషన్ డీలర్ల ఘన సన్మానం

చంద్రగిరి, మే 21 ప్రభాతవార్త:



చంద్రగిరి మండలంలోని రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చక్రవర్తి రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎంఎల్‌ఏ పులివర్తి నానిని ఘనంగా సన్మానించారు. రేషన్ సరుకుల పంపిణీ కొరకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండియు వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో రేషన్ డీలర్లు ఎంఎల్‌ఏని ఆయన నివాసంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఎండియు వ్యవస్థను రద్దుచేసి, చౌకదుకానాల వద్ద సరుకులు పంపిచేయడానికి కృషి చేసిన పులివర్తి నానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ మండలంలోని 42 రేషన్ షాపుల్లో మొదటి ప్రాధాన్యత ఆయా షాపుల పరిధిలోని కార్డుదారులకు ఇవ్వాలన్నారు. తప్పనిసరిగా రేషన్ షాపు వద్ద నిత్యవసర సరుకుల లభ్యతపై బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి, ఉపాధ్యక్షులు కుమార్ నాయుడు, డీలర్లు పాల్గొన్నారు.

## నరశింగాపురంలో మహాభారత ఉత్సవాలు

రెడ్డివారి భార్గవి రెడ్డి ప్రత్యేక పూజలు

చంద్రగిరి, మే 21 ప్రభాతవార్త:



మండల రిధిలోని నరశింగాపురంలో ఎంపిటిసి మించల అశ్విణీ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం నుండి మహాభారత ఉత్స వాలు ప్రారంభిస్తున్నారు. మహాభారత ఉత్స వాలను పురస్కరించుకుని బుధవారం మాజీ ఎంఎల్‌ఏ రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి సతీమణి రెడ్డివారి భార్గవిరెడ్డి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. మహాభారత ఉత్స వాల ప్రారంభోత్స వంలో భాగంగా ఉదయం 9 గంటల నుండి 10 గంటల మధ్యన ఆలయంలో ధ్వజారోహణం నిర్వహించనున్నట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు హరికథ, రాత్రి 9 గంటలకు శ్రీకృష్ణలీలలు నాటకం ప్రారంభించనున్నట్లు వెళ్ళడించారు. 18 రోజుల పాటు ఉత్స వాలు జరుగుతాయని అన్నారు. ఈ ఉత్స వాలకు భక్తులు హాజరై ద్రౌపధి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.

## యోగా డేని విజయవంతం చేద్దాం

తిరుపతి విద్య, మే 21 ప్రభాత వార్త



యోగాంధ్రా 2025 కు విస్తృత ప్రచారం కల్పించడంలో భాగంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో యోగా కార్యక్రమాన్ని బుధవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. యోగా మాస్టర్లు ప్రజాప్రతినిధులు,అధికారులతో యోగ ఆసనాలను ప్రాక్టీస్ చేయించారు.సుమారు 40 నిమషాల పాటు యోగా ప్రాక్టీస్ జరిగింది. విశ్వమంతా యోగాతో ఆరోగ్యం నినాదంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దేను ని ఐదు లక్షల మందితో నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. జూన్ 1 వ తేది విశాఖపట్నంలో11వ అంతర్జాతీయ యోగా డే ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం నుంచి జూన్ 21వ వరకు యోగా మాసంగా ప్రభుత్వం ప్రకటించినట్లు ఆయన చెప్పారు.యోగా ను తిరుపతి జిల్లాలో ప్రతి మూలకు తీసుకెళ్ళాలని ఆయన కోరారు. అధికారులు,ప్రజాప్రతినిధులు యోగా ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయిని ఆయన తెలిపారు. యోగాను కేవలం జూన్ 21 వ తేది మాత్రానికే పరిమితం చేయకుండా నిత్యం చేయాలని ఆయన ప్రజలను కోరారు. కాగా యోగాను ప్రతి ఒక్కరు జీవితంలో ఒకభాగం చేసుకోవాలని ఎస్పీ హర్షవర్థన్ రాజు అన్నారు.యోగాను ప్రపంచవ్యాప్తంగా యోగాకు ఆదరణ పెరుగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనరి, బ్యూటిఫికేషన్ కార్పోరేషన్ ఛైర్ పర్సన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, బిజెపి తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జీ అజయ్ కుమార్, వైస్ ఛాన్స లర్ ఉమా, జాయింట్ కలెక్టర్ శుభం సబన్సల్, డి ఆర్ ఓ, ఆర్డీఓ, మున్సి పల్ కార్పోరేషన్ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సహాయ కమిషనర్ అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రిని కలసిన మాజీ జడ్పీటీసీ బీరేంద్రరాజు

సత్యవేడు, మే 21 ప్రభాతవార్త:



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తాడే పల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం తిరుపతి జిల్లా సత్యవేడు వైసీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్, వైసీపీ సీనియర్‌నేత, మాజీ జడ్పీటీసీ తాడిపత్రి నియోజకవర్గం వైసీపీ పరిశీలకుడు బీరేంద్రరాజు, బెల్ట్ రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా జగన్ ఎలా ఉన్నావ్ రాజేష్, సత్యవేడు ఎలా ఉంది తాజా పరిణామాలు, సంగతులు ఏంటంటు వాకబు చేశారు. బీరేంద్రరాజును సైతం మీరు ఎలా ఉన్నావు అంటూ ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సత్యవేడులో తాజా రాజకీయ పరిణామాలు గురించి మాట్లాడారు. సత్యవేడులో తాజాగా నెలకొన్న అనిస్థితి, కూటమి నాయకులు వ్యవహరిస్తున్న తీరు, ప్రజల్లో అల్లుకున్న గందరగోళం స్థానిక పాలన పరిస్థితుల సైతం జగన్మోహన్‌రెడ్డికి వివరించినట్లు తెలిసింది.

## నేడు సత్యవేడులో మినీ మహానాడు

సత్యవేడు, మే 21 ప్రభాతవార్త:

సత్యవేడు నియోజకవర్గంలో నేడు జరిగే మినీ మహానాడుకి నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికి ఇదేకి ఇదే మా ఆహ్వాన అంటూ సత్యవేడు పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, కో-ఆర్డినేటర్ శ్రీపతిబ ాబు ఓ సమావేశంలో పిలుపుని చ్చారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు సత్యవేడులోని మస్తాన్ కల్యాణ మండపంలో జరగబోయే మినీ మహానాడు రాష్ట్ర స్థాయి మహానాడుకి ఇది తొలి అడుగు అంటూ అందుకే సత్యవేడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీ స్థాయిలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర యాదవ కార్పోరేషన్ ఛైర్మన్, తిరుపతి జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, రాష్ట్ర జిల్లా ముఖ్య నాయకులు రానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, కృష్ణచైతన్య నెల్సన్, మండేలా, సురేంద్ర, షణ్ముగం, ఎండి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో సమగ్ర విచారణ చేపట్టాలి

### - ఆర్.పిఐ నాయకకులు, దళిత నాయకుల డిమాండ్

తిరుపతి హెల్త్, మే 21 ప్రభాతవార్త :

బీటెక్ విద్యార్థి జెమ్స్‌పై తోటి విద్యార్థులు కుల దూషణ చేసి విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచిన యశ్వంత్ తోటి విద్యార్థులకు పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి వారిని కఠినంగా శిక్షించాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు దాసరి చెన్నకేశవులు డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దోషులను వెంటనే శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు అశోక్‌బాబు, తాళ్ళపాక దాము, దుగ్గాని జయరాం, తదితరులు పాల్గొన్నారు.

21 హెల్త్ 02- విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నేతలు

# తిరుపతి డివిజన్

## పవన్‌కల్యాణ్ ఆశయసాధనకు కృషి చేద్దాం

తిరుపతి(రవాణ),మే 21ప్రభాతవార్త



జనసేనాని, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు అందరూ కృషి చేద్దామని, పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. సరైన సమయంలో పార్టీని నమ్ముకున్న వారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. బుధవారం డాక్టర్ హరిప్రసాద్‌ను జనసేన పార్టీ తిరుపతి ప్రధాన కార్యదర్శి,ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యక్రమాల కమిటీ సభ్యుడు సుమన్‌బాబు కలిశారు.మర్యాదపూర్వక కలయికలో 27వ వార్డు అధ్యక్షుడు, ఆది, ఉపాధ్యక్షుడు సుధాకర్,సుమంత్, పవన్‌కుమార్, శివలతో కలసి పూలబొకేను అందజేశారు. దుశ్శాలువతో సన్మానించారు.

## దేశంలో సమాచార సాంకేతిక విప్లవకర్త

### స్వర్గీయ రాజీవ్‌గాంధీ -గౌడపేరచిట్టిబాబు



***తిరుపతి(రవాణ),మే 21ప్రభాతవార్త*** నేటి ఆధునిక భారతదేశ నిర్మాణానికి మూలస్తంభం దివంగత మాజీప్రధాని రాజీవ్‌గాంధీ అని తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరచిట్టిబాబు తెలిపారు. బుధవారం రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని తిలక్‌రోడ్డులోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి రాజీవ్ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ నేడు ప్రపంచంలో అగ్రగామిదేశాలతో సమానంగా భారతదేశం ఎదగడానికి రాజీవ్‌గాంధీ కారణమని అన్నారు. అతి చిన్న వయసులోనే ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ఎంతో సమర్థవంతంగా పనిచేశారని కొనియాడారు.1984 నుండి 1989వరకు ప్రధానిగా ఆయన తీసుకున్న ఎన్నో కీలకమైన నిర్ణయాలు నేడుదేశ ప్రగతికి దోహదం చేస్తున్నాయని చెస్సారు. ఆయన నాయకత్వం పేదబడుగుబలహీన వర్గాల వారికి అభ్యున్నతికి ఎంతో దోహదపడ్డాయన్నారు. ఇంకా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, మాంగాటి గోపాల్‌రెడ్డి, కంభంపాటి మురళీకృష్ణ, సీనియర్‌నాయకఉలు చిత్తూరు శివశంకర్, గోపి, చంగల్‌రాయుడ, ఐరాల గోపి, పవన్‌కుమార్,బోయన నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## చౌకా దుకాణం ద్వారా ఎండు మిర్చి పంపిణీ చేయండి

పాకాల, మే 21, ప్రభాతవార్త



రాష్ట్రంలోని అన్ని చౌక దుకాణాలలోని లబ్దిదారులకు ఎండుమిర్చి పంపిణీ చేయవలసినదిగా ప్రజలు కోరుతున్నారు. రాష్ట్రంలోని రైతులు ఆరుగాలం శ్రమించి తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించని సమయంలో ప్రభుత్వం స్పందించి రైతులు వద్ద నుంచి పంటలను కొని రాష్ట్రంలోని అన్ని చౌక దుకాణాల ద్వారా ఎండుమిరపకాయలు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, పళ్లు, కూరగాయలు ఆయా సీజన్లో అన్నదాత పండించే ఆహార పదార్థాలన్నింటినీ కూడా చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలి అని ప్రభుత్వానికి అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు. నిత్యవసర వస్తువులను వ్యాపారుల వద్ద నుంచి ఎక్కువ ధరకు కొనలేని నిరు పేద కుటుంబాలకు రాష్ట్రంలోని రైతులు పండించిన అన్ని రకాల పంటను పౌరసరఫరాల శాఖ ద్వారా కొనిపించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ, ఇటు పేద వారికి సరసమైన ధరలకు అందే విధంగా కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టు వలసినదిగా ఈ సందర్భంగా ప్రజలు రైతుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందుతున్నాయి.

## ఏపి ఇఎపిసెట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన యస్వీయూ విసి

తిరుపతి విద్య మే 21 ప్రభాత వార్త

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అప్పారావు బుధవారం ఉదయం తిరుపతిలోని టిసియస్.ఇయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి పక్షాన జరుగుతున్న ఏపి ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ 2025 పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.పరీక్ష కేంద్రంలో పరీక్ష ప్రశాంతంగా జరుగుతున్నాయని వారు అన్నారు.జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వవిద్యాలయం,కాకినాడవాళ్ళుఈపరీక్షలునిర్వహిస్తున్నారు.మే21 నుండి 27 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి.

## యోగాంధ్ర-2025 ప్రచార బ్రోచర్ ఆవిష్కరణ

తిరుపతి విద్య మే 21 ప్రభాత వార్త



రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న యోగాంధ్ర 2025 ప్రచారానికి మద్దతుగా ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ప్రత్యేక ప్రచార బ్రోచర్ ను విడుదల చేశారు. బుధవారం వీసీ ఛాంబర్లో విడుదల చేసిన అనంతరం వీసీ మట్లాడుతూ యోగా అంతర్గత సమతుల్యత, మానసిక దృఢత్వం, సమగ్ర శ్రేయస్సుకు మార్గమని తెలిపారు. ఆరోగ్యకరమైన,మేధోసమాజాన్ని నిర్మించాలనే ప్రభుత్వ దార్శనికతకు మద్దతు ఇవ్వడం మనకు గర్వకారణం అని వ్యాఖ్యానించారు.రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ మానసిక,శారీరక ఆరోగ్యం అవసరమని, విశ్వవిద్యాలయం సమాజంలో ఇటువంటి పద్ధతులను ప్రోత్స హించడానికి కట్టుబడి ఉందని అన్నారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 2025 మే 22 నుండి జూన్ 21 వరకు "యోగా మాసం" జరుపుకుంటుందవి,ఈ సమయంలో రోజువారీ యోగా సెషన్లు ఉదయం 8:20 నుండి ఉదయం 9 గంటల వరకు అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట నిర్వహిస్తున్నామన్నారు. బోధన,బోధనేతర సిబ్బందికి పాల్గొంటారని, శిక్షణ పొందిన యోగా బోధకుల మార్గదర్శకత్వంలో నిర్వహించబడే ఈ సెషన్లు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మానోప్రశాంతతను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో రూసా సీఈఓ వంశీ రాయల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య టి దామోదరం, పరీక్షల డీన్ ఆచార్య ఎస్ కిషోర్, అసిస్టెంట్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ యాదవ్, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి వివేక్ పాల్గొన్నారు.

## మణి బాగున్నావా... ఆరోగ్యం ఎలా ఉంది.... సుధీర్ రెడ్డి..

. రేణిగుంట మే 21 ప్రభాతవార్త



మణి బాగున్నావా... ఆరోగ్యం ఎలా ఉంది అంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి రేణిగుంట పట్టణం వేణుగోపాలపురం కు చెందిన టిడిపి మండల మాజీ ఎస్సీ సెల్ కన్వీనర్, పార్టీ సీనియర్ నేత నెల్లూరు సుబ్రహ్మణ్యంను బుధవారం ఆప్యాయంగా పలకరించారు. గత కొద్ది నెలల క్రితం నెల్లూరు సుబ్రహ్మణ్యం తీవ్ర అస్వస్థతకు గురై చెన్నై ఆసుపత్రిలో చికిత్స తీసుకొని విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పరామర్శించి, ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, రేణిగుంట టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పుష్ప నాదం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అన్నసంపల్లి భాస్కర్ రెడ్డి, అగ్రహారం భాస్కర్ రెడ్డి, కొరియర్ రవి, గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి టిడిపి నేతలతో కలిసి రేణిగుంట మండలం అత్తూరు గ్రామంలో జరుగుతున్న అమ్మవారి జాతరలో పాల్గొన్నారు.

## రైల్వే లైను, రోడ్డు పనులు వేగవంతం...

. రేణిగుంట మే 21 ప్రభాతవార్త



తిరుపతి చెన్నై రైల్వే లైను, రోడ్డు పనులు వేగవంతం కోసం శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి బుధవారం రేణిగుంట తహసిల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసిల్దార్ సురేష్ బాబు పనులకు సంబంధించిన రికార్డులను ఆర్డీవోకు సమర్పించారు. అన్ని రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పనులు వేగవంతంగా జరగడానికి ప్రణాళికలు రూపొందించాల్సి ందిగాతాసిల్దారునుఆదేశించారు.డిప్యూటీతహసిల్దార్‌శ్యాంప్రసాద్,సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలను బాధ్యతాయుతంగా పెంచాలి... జయలక్ష్మి

రేణిగుంట మే 21 ప్రభాతవార్త



పిల్లలను బాధ్యతాయుతంగా పెంచాలని తల్లిదండ్రులకు ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి పిలుపునిచ్చారు. రేణిగుంట మండలం మల్లెమడుగు గిరిజన కాలనీ, వెదల్లచెరువు గ్రామాలందు బుధవారం ప్రగతి స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో పిల్లల పెంపకంపై తల్లితండ్రులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు మొదటి గురువులు తల్లితండ్రులేనన్నారు. వారి ప్రభావం పిల్లలపై ఎక్కువగా ఉంటుందన్నారు. వీలైనంత ఎక్కువ సమయం తల్లిదండ్రులు పిల్లలతో గడపాలన్నారు. వారికి మంచి మాటలు, విజ్ఞాన కథలు చెప్పాలన్నారు. తద్వారా వారిలో మంచి లక్షణాలు అలవాడతాయన్నారు. పిల్లలు చెడు అలవాట్లకు దగ్గర కాకుండా వారిని మంచి మార్గంలో పెట్టాలన్నారు. పిల్లల భవిష్యత్తు తల్లితండ్రులపైనే ఆధారపడి ఉందని ప్రతి తల్లి తండ్రి గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త శిరీష తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I,**R.V.CHENCHAIAH** (Old Name), S/o R.Venkama Naidu, R/at D No:1-47 Mannavaram Village, Srikalahasti Mandal, Tirupati Dist. A.P. I have changed my name to **CHENCHAIAH RANGINENI** S/o R.Venkama Naidu, Henceforth I will be known as **CHENCHAIAH RANGINENI** (New Name)

# తెలుగువారి ఆత్మగౌరవం కాపాడేందుకే టిడిపి ఆవిర్భావం



నాయుడుపేట మే 21 ప్రభాతవార్త ;

తెలుగువారి ఆత్మగౌరవం కాపాడేందుకే ఆనాడు దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు తెలుగుదేశంపార్టీని స్థాపించారని సూళ్ళూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. ఆమె ఆధ్వర్యంలో నాయుడుపేట కెకెకళ్యాణ మండపంలో సూళ్ళూరుపేట నియోజకవర్గ స్థాయిలో మినిమహానాడు నిర్వహించారు. మినిమహానాడుకు నాయుడుపేట, పెళ్ళకూరు, ఓజిలి, దొరవారిసత్రం, సూళ్ళూరు పేట, తడ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అబిమా నులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లడుతూ రాష్ట్రంలో బడుగుబలహీన వర్గాలు అభివృద్ది చేందాలంటే అది తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమౌతుందన్నారు. పేదప్రజల ఆకలి తీర్చేందుకే అప్పట్లో ఎన్‌టిఆర్ కేజిబియ్యం రెండు రూపాయలకే అందించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 12కోట్లుతో ఎస్సీ, ఎస్టీకాలనిల్లో సిమెంటురోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. అనంతరం తిరుపతిజిల్లాపార్టీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులో ఉన్న ఇచ్చినమాట నిలబెట్టుకొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కటుబడి ఉన్నారని తెలిపారు. సూపర్‌సిక్స్‌లో ప్రజలకు ఇచ్చిన హామిలు ఒకొక్కటిగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 23న జిల్లాస్థాయిలో, 27,28,29తేదీల్లో రాష్ట్రస్థాయి లో కడపలో మహనాడు నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తెలుగుతమ్ముళ్ళు తరలివచ్చి మహానాడును విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు, వెంకటగిరి ఎమ్మెల్యేలు పాశం సునీల్, కురుగొండ రామకృష్ణ, ప్రముఖ ప్రారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీఎంపి నెలవల సుబ్రమణ్యం, మండలపార్టీ అధ్యక్షులు ఎస్ సంద్రారెడ్డి, విజయనాయుడు, సంచి కృష్ణయ్య, వేమసాని శ్రీనివాసులు నాయుడు, ఆకుతోట రమేష్, కామిరెడ్డి మురళీరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 29 నుండి కృషి సంకల్పయాత్ర

### - కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి శ్రీనివాసరెడ్డి



వెంకటగిరి, మే 21, ప్రభాతవార్త

ఖరీఫ్ పంట ఉత్పత్తిని పెంచి సాగు ఖర్చులు తగ్గించే ముఖ్య ఉద్దేశంతో కృషి సంకల్ప యాత్రను ఈనెల 29వ తేదీ నుండి జూన్ నెల 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కృషి సంకల్ప యాత్రను ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కెవికెలో రైతులతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఉపాధ్యాయులు, అధికారులు రైతుల అభివృద్ధికి పని చేయాలని కేంద్రమంత్రి సూచించినట్లు తెలిపారు. రైతులు విచక్షణారహితంగా ఎరువులు పురుగు మందులు వాడకుండా భూ సారాన్ని కాపాడాలని సూచించారు. ఈ యాత్రలో రైతులకు జీవనోపాధి భరోసా కల్పించుట, లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పించడం ద్వారా పంట ఉత్పత్తి పెంచి భారతదేశాన్ని ప్రపంచానికి ఆహారం అందించే విధంగా తయారు చేయడమే లక్ష్యమని అన్నారు. దేశంలో అన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతులు, శాస్త్రవేత్తలు, ఈ కార్యక్రమం పాల్గొనాలని కేంద్ర మంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపిడిఓ



కోట, మే 21 ప్రభాతవార్త

కోట పంచాయతీ పరిధిలోని మూడవ సచివాలయాన్ని బుధవారం ఎంపిడిఓ దిలీప్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై రికార్డులు సక్రమంగా ఉండాలని కోరారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపిడిఓ పాల్గొన్నారు. మండల స్థాయిలో విజన్ ప్లాన్ పారదర్శకంగా ఉండాలని కోరారు. ప్రభుత్వ పథకాలపై ఎప్పటికప్పుడు కార్యదర్శులు అప్‌డేట్‌గా ఉండాలని సూచించారు.

## సాయికృష్ణారెడ్డిని పరామర్శించిన పేర్నాటి



కోట, మే 21 ప్రభాతవార్త

వైసీపీ యువ నాయకుడు దువ్వూరు సాయికృష్ణారెడ్డి ఇటీవల కాలుజారి పడ్డారు. ఆ మేరకు కోటలోని తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయికృష్ణారెడ్డిని రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## డాక్టర్ శివాజీరావు సేవలు చిరస్మరణీయం



కోట, మే 21 ప్రభాతవార్త

కోటలో పేద ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించిన డాక్టర్ శివాజీరావు సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు అన్నారు. శివాజీరావు 14వ వర్ధంతిని పురస్కరించుకొని కోటలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేచలం, చిట్టమూరు శ్రీనివాసులురెడ్డి, బాషా, మునిరాజా, సారంగం రమేష్‌బాబు, వేణుగోపాల్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్ : ఎస్ఐ

వాకాడు, మే 21, ప్రభాతవార్త

వాకాడు గ్రామంలోని ఇటీవల ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు ఫిర్యాదు మేరకు బుధవారం చోరీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోట కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ ఐ నాగబాబు తెలిపారు. ఎస్సై నాగబాబు మాట్లాడుతూ గూడూరు డిఎస్పి, వాకాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ హుస్సేన్ భాష ఆదేశాల మేరకు గత నెలలో నెల్లూరు నవాబుపేటకు చెందిన బందెల శ్రీనివాసులు, సూళ్లూరుపేట బాబుజి కాలనీకి చెందిన దక్షది శీనులు కలిసి వాకాడు గ్రామంలోని రాత్రిపూట ఓ గృహంలో బీరువా తలుపులు పగలగొట్టి బంగారు ఆభరణాలు తీసుకెళ్లాలని ఫిర్యాదు మేరకు ఆ వ్యక్తులను సేదించి పట్టుకొని అరెస్టు చేసినట్లు వాగోదు సబ్ ఇన్స్పెక్టర్ నాగబాబు తెలిపారు.

## వరుణుడి రాకతో ప్రజలకు ఉపశమనం

కోట, మే 21 ప్రభాతవార్త

వేసవి ప్రారంభమైనప్పటి నుంచి వేడి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు వరుణుడు ఉపశమనం కలిగించాడు. మార్చి ప్రారంభం ఎండలు మండిపోవడం, దానికి తేమ తోడు కావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. గత కొద్దిరోజులుగా ఆకాశం మేఘావృతమై అడపదడప వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు మండలంలో చల్లటి వాతావరణం నెలకొంది. దీంతో ప్రజలకు ఉపశమనం కలగడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రైతులు కూడా తమ పొలాలను దుక్కులు దున్నుకునేందుకు సిద్ధమవుతున్నారు.

## మోటార్‌బైక్ చోరీ

కోట, మే 21 ప్రభాతవార్త : కోటలోని ప్రగతి రోడ్డు సమీపంలో మంగళవారం రాత్రి రవీంద్రకు చెందిన టివిఎస్ ఎక్స్‌ఎల్ చోరీకి గురైంది. తన ఇంటి వద్ద పెట్టి నిద్రిస్తుండగా దుండగులు టివిఎస్ ఎక్స్‌ఎల్‌ను అపహరించారు. సిసి ఫుటేజ్ ఆధారాలతో బుధవారం బాధితుడు కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత వారంరోజులుగా కోట మండలంలో వరుసగా బైక్ దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విద్యానగర్‌కి చెందిన ఎన్‌బికెఆర్ ఉద్యోగి రవీంద్రకు చెందిన హోండా షైన్ బైక్ పట్టపగలే చోరీకి గురైంది. బైక్‌లు వరుసగా చోరీకి గురవుతుండటంతో వాహనచోదకులు ఆందోళనకు గురవుతున్నారు.

## నూతన సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభం



సూళ్లూరుపేట, మే 21 ప్రభాతవార్త

సూళ్లూరుపేట నుంచి విజయవాడకు వెళ్లేందుకు నూతన సూపర్ లగ్జరీ బస్సును బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతులు మీదుగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ ఇటీవలే సూళ్లూరుపేట డిపో నుంచి నూతనంగా మూడు బస్సులను ప్రారంభించామన్నారు. అలాగే చెన్నై, హైదరాబాద్, బెంగళూరులకు బస్సులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, కొక్కు శంకరయ్య, అలవల శ్రీనివాసులు, కె.శ్రీధర్, డిపో మేనేజర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంగణ ఎంపికలో 180 మందికి ఉద్యోగావకాశాలు



గూడూరు, మే 21, ప్రభాతవార్త

గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఐటిఐ కళాశాలలో ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రాంగణ ఎంపికలు జరిగాయి. వివిధ కళాశాలల నుండి హాజరైన అభ్యర్థులకు పలు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు లభించాయి. రెండో పట్టణ పరిధిలోని తిలక్ నగర్ ప్రాంతంలో ఉన్న ఐటిఐ కళాశాలలో ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్ట్ ఆదేశాల మేరకు ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లాలోని గూడూరు, వెంకటగిరి, చిట్టేడు, వాకాడుల్లో ఉన్న ఐటిఐ కళాశాల విద్యార్థులు హాజరయ్యారు. గూడూరులోని నెల్ క్యాస్ట్, అరబిందో ఫార్మా కంపెనీ, కైసర్ ప్రొడక్ట్స్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హులైన వారికి ఉద్యోగావకాశాలు కల్పించారు. ఈ సందర్భంగా ఐటిఐ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు తదితరులు మాట్లాడుతూ వివిధ కంపెనీల్లో 180 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించాయని తెలిపారు.

## ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పనిచేయాలి

### ఎంపిపి గడ్డం అరుణ రెడ్డి



ఓజిలి, మే 21, ప్రభాతవార్త

ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పని చేయాలని ఎంపిపి గడ్డం అరుణ రెడ్డి పేర్కొన్నారు. మండలంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సర్వసభ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరే విధంగా అధికారులు పనిచేయాలన్నారు. ముందుగా ఆయా శాఖల అధికారులు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి శాఖల వారీగా వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మీనాక్షి, ఎంపిడిఓ విజయలక్ష్మి, ఎంఆర్ఓ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## నేటి నుండి సిమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

బాలాయపల్లి, మే 21, ప్రభాతవార్త

సిమ్స్ టీటీడీ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణకు గ్రామీణ ప్రాంతాలకే పింక్ బస్సుల ద్వారా వైద్యులచే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి డాక్టర్ లిఖిత తెలిపారు. ఈ నెల 22న మన్నూరు, 26న అలిమిలి, నిడిగల్లు గ్రామాలలో పింక్ బస్సు వస్తున్నట్లు తెలిపారు. 29న గొట్టికాడు, నిండలి గ్రామాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. ఈ స్క్రీనింగ్ పరీక్షలు పూర్తిగా ఉచితం. 35 సం.ల నుంచి 65 సం. వయస్సు వారు పరీక్షలు చేసుకోవాలని తెలిపారు.

## మినీ మహానాడుకు తరలిరావాలి : రాయిమస్తాన్‌నాయుడు

బాలాయపల్లి, మే 21, ప్రభాతవార్త

ఈనెల 22వ తేదీ వెంకటగిరి పట్టణంలోని పింజెల వీరయ్య కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో మినీ మహానాడు కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షులు, యాదవ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నరసింహ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నట్లు చెప్పారు. నియోజకవర్గం లోని పార్టీ నాయకులు కార్యకర్తలు మినీ మహానాడుకు హాజరు కావాలని కోరారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గం నుండి జన సమీకరణ పై చర్చిస్తారని తెలిపారు.

## నేడు హనుమాన్ శోభాయాత్ర



వెంకటగిరి, మే 21, ప్రభాతవార్త

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నేడు జరగబోయే హనుమాన్ శోభాయాత్రను హిందూ బంధువులు విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ కమిటీ సభ్యులు కోరారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న విశ్వదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నుండి శోభాయాత్ర బయలుదేరుతుందని తెలిపారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. పట్టణవాసులందరూ ఈ శోభాయాత్రలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకండ అధ్యక్షులు నరా రవి, పట్టణ అధ్యక్షులు వడ్లమూడి భాస్కర్, కార్యదర్శి అలిమెలి మల్లికార్జున, కోశాధికారి కాసుల సుధాకర్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

### - మున్సిపల్ చైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి



సూళ్లూరుపేట, మే 21 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ఉన్న మంచినీటి వనరులను ఉపయోగించుకునే విధంగా చర్యలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కమిషన్ చిన్నయ్యతో కలిసి కోటపోలూరులోని సమ్మర్ స్టోరేజి ట్యాంకు, శ్రీనగర్ కాలనీ వద్ద ఉన్న కాళంగి పరివాహక ప్రాంతాన్ని, ఇతర మంచినీటి వనరులు లభించే ప్రారంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చేయాలన్నదే లక్ష్యమని, ఇందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పట్టణంలో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ మనోజ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.












## నేనే రాజు! నేనే మంత్రి!

### - విధులకు ఎప్పుడు వస్తారో! ఎప్పుడు వెళ్తారో! తెలియని పరిస్థితి

పూతలపట్టు, మే 21 ప్రభాతవార్త:



పూతలపట్టు మండలానికి నేను రాజు! నేనే మంత్రి! అనే తీరుతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపిడిఓ వ్యవహరిస్తున్నారు. పూతలపట్టు ఎంపిడిఓగా నాలుగు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన ఈయన ఒక నెల రోజుల పాటు విధులకు సక్రమంగా హాజరు కాకుండానే నెల రోజుల పాటు పూర్తిగా విధులు నిర్వర్తించినట్లు రికార్డుల్లో సంతకాలు చేసి జీతం తీసుకున్నట్లు తెలిసింది. మండల పరిషత్ కార్యాలయంకు సంబంధించి ఎవరైనా ఎదైనా సమాచారం అడిగితే తనకు తెలియదని ముక్కుసూటిగా చెప్పి అడిగిన సమాచారం ఇవ్వకుండా దాటి వేయడం ఈ ఎంపిడిఓ నైజంగా మారింది. మండల పరిధిలో గతంలో కాంట్రాక్ట్ పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇప్పుడు బిల్లులు మంజూరు అయితే ఆ బిల్లులు చెల్లించాలంటే తనకు 2 శాతం వాటా ఇవ్వాల్సిందేనని కాంట్రాక్టర్లను ఎంపిడిఓ వేధిస్తున్నట్లు ఆరోపణలు వున్నాయి. తాము చేసిన పనులకు బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఇప్పటికే పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని, ఈ పరిస్థితుల్లో వచ్చిన మొత్తంలో తాము ఎంపిడిఓకు పర్సంటేజ్ ఏం ఇచ్చేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. మండల పరిషత్ కార్యాలయంకు సంబంధించి ఎదైనా సమాచారం అడిగినప్పటికీ ఎంపిడిఓ నిక్కచ్చిగా తన వద్ద ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేస్తుండటంతో విలేకరులకు సైతం దిమ్మతిరుగుతుంది. ఈ పరిస్థితుల్లో పూతలపట్టు ఎంపిడిఓపై వస్తున్న ఆరోపణలను జిల్లా పరిషత్ ఉన్నత అధికారులు విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఇటు పనులు చేసి బిల్లులు పెండింగ్‌లో వున్న కాంట్రాక్టర్లు వేడుకుంటున్నారు.

## మహోజ్వలిత శోభతో శ్రీ తిరుపతి గంగమాంబ విశ్వరూప దర్శనం



కుప్పం, మే 21 ప్రభాతవార్త

కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లి శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మవారు విశ్వరూప దర్శనంతో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మా.. తల్లీ.. గంగమ్మా.. మమ్మల్ని చల్లంగ చూడమ్మా అంటూ భక్తులు కొంగుబంగారమైన మోక్ష ప్రదాయనిని ప్రజలు మొక్కుకున్నారు. 24గంటలపాటు శిరస్సు ఊరేగింపు అనంతరం బుధవారం ఉదయం ఆలయం వద్దకు అమ్మవారి శిరస్సు చేరుకుంది. అనంతరం అమ్మవారిని బంగారు ఆభరణాలతో అల ంకరించి భక్తు లకు దర్శన భాగ్యం కల్పించారు. మహామంగళహారతి నిర్వహించాక భక్తజన కోటి ఆలయంలో పోటెత్తింది. ఉదయం నుండి రాత్రి 11గంటల వరకు ఆలయం వద్ద ఏర్పాటుచేసిన క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. మహోజ్వలిత శోభతో ప్రకాశిస్తూ దర్శనమిచ్చిన అమ్మవారిని మరి ంత దగ్గరగా చూడాలని భక్తజన కోటి ఉబలాటపడ్డారు. టిటిడి తరపున అమ్మవారికి సారెను అధికారులు సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం లభించేలా చర్యలు చేపట్టారు. అమ్మవారి దర్శనం అనంతరం శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ ఆలయ ఆవరణలో భక్తులు భారీగా అమ్మవారికి జంతుబలులు ఇచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లు, చల్లిపిండిలతో అమ్మవారికి నైవేద్యం పెట్టారు. రాత్రి 11గంటల వరకు అమ్మవారి దర్శనం కొనసాగింది. తదనంతరం అమ్మవారిని ఆమె పుట్టింటికి తీసుకెళ్లిన అనంతరం అమ్మవారికి అక్కడ వడిబాల సమర్పించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. తదనంతరం అమ్మవారు జలవాసమేగే కార్యక్రమంను శాస్త్రోకంగా నిర్వహించారు.

ఏడాదికోసారి జరిగే శ్రీ తిరుపతి గంగమాంబ జాతరలో చివరి రోజైన బుధవారం అమ్మవారికి మొక్కుబడులు చెల్లిం చుటకు విచిత్ర వేషధారణలతో అమ్మవారిని దర్శించు కున్నారు. మొక్కులు కలిగిన పలువురు భక్తులు పురుష, స్త్రీ వేషధారణలతో అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు నోటికి శూలాలు గుచ్చుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## తుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డాలర్స్ దివాకర్ రెడ్డి



తిరుపతి కార్పొరేషన్, మే 21, ప్రభాతవార్త

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా డాలర్స్ దివాకర్ రెడ్డి బుధవారం ఉదయం పదవి బాధ్యతలు చేపట్టారు. తుడా కార్యాలయంలో ఉపాధ్యక్షులు ఎన్. మౌర్య సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య, తుడా అధికారులు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌ను అభినందించారు.

## శివయ్యసేవలో మిస్ ఆసియా



శ్రీకాళహస్తి, మే 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మిస్ అసియా జాతీయ హ్యాండ్‌లూమ్ ఆంబాసిడర్ రేషమి ఠాకూర్ పూజలు జరిపించుకున్నారు. ఆమెకు ఆలయ మర్యాదలతో ఆలయ పిఆర్ఓ రవి స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం చేసుకున్న ఆమెకు మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. శ్రీకాళహస్తీశ్వరిని దర్శనం తనకు ఎంతో సంతృప్తి నిచ్చిందన్నారు. ఆలయంలో ఉన్నంత సేపు ఎంతో ప్రశాంతత కల్గించిందన్నారు. ఇలాంటి ఆలయాలు దక్షిణ భారత దేశంలో మరొకటి లేదంటే అతిశయోక్తి కాదేమో అన్నారు.